క్లుప్తంగా

ఘనంగా శ్రీచక్రార్చన



విలసవిల్లి రామ మందిరంలో శ్రీచక్రార్చన నిర్వహిస్తున్న అర్చకులు

ఉప్పలగుప్తం: విలసవిల్లి గ్రామంలోని రామ మందిరంలో నిర్వహిస్తున్న నక్షత్ర నవగ్రహ పూర్వక మహా సౌర యాగంలో భాగంగా 7వ రోజు శ్రీచక్రార్చన ఘనంగా నిర్వహించారు. యాగకర్త ముష్నంగి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో సూర్యారాధన, చండీ హోమం, రాజ శ్యామల హోమం నిర్వహించి సౌర అష్టాక్షరీ జపాలు జరిపారు. అనంతరం భరణీ నక్షత్ర జాతకులతో ఉసిరి వృక్షానికి పూజ గావించి గోపూజ నిర్వహించారు.

వైభవంగా సత్తెమ్మతల్లి జాతర



ప్రత్యేక అలంకరణలో సత్తెమ్మతల్లి

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి ఓఎన్‌జీసీ సెంటర్ వద్ద వేంచేసి యున్న సత్తెమ్మతల్లి జాతరను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు చేసి నైవేద్యాలు అర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. తీర్థం నిర్వహించి, గరగ నృత్యాలతో గ్రామోత్సవం జరిపారు. దాతల సహకారంలో అన్న సమారాధన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శాస్త్రోక్తంగా మాతంగి కన్యకల పూజ



కన్యకలకు పాద పూజ చేస్తున్న ముత్తయిదువులు

అమలాపురం టౌన్: స్థానిక విద్యుత్ నగర్‌లోని శ్రీఆది శేష నిలయంలో జరుగుతున్న శ్యామల నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సారిక శ్యామల అవతరణ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా 30 మందికి పైగా కన్నె పిల్లలకు మాతంగి కన్యకల పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముత్తయిదువులు ఆ కన్యలకు పూజ చేశారు. వేము వెంకట శివకుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం వైభవంగా సాగింది. నవరాత్రుల్లో అమ్మవారిని తొమ్మిది స్వరూపాలతో ఆరాధిస్తారని శివకుమార్ తెలిపారు.

గజమాల యాత్ర నిర్వహణకు సహకరించాలి

అల్లవరం: అంతర్వేదిలో శ్రీలక్ష్మీ నరసింహ స్వామి కల్యాణాన్ని పురస్కరించుకుని ఆలయ నిర్మాణ కర్త కొపనాతి కృష్ణమ్మకు సమర్పించనున్న గజమాల యాత్ర ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని అమలాపురం రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్ అన్నారు. ఎస్సై హరీష్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఓడలరేవులో అగ్నికుల క్షత్రియులతో సమావేశమైయ్యారు. ఓడలరేవు నుంచి అంతర్వేది వరకు నిర్వహించే గజమాల యాత్రలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్నా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గజమాల యాత్ర ప్రశాంతగా జరిగేందుకు కమిటీ కృషి చేయాలన్నారు.

విద్యార్థికి సత్కారం



తనుష్ తేజను అభినందిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

ఉప్పలగుప్తం: ఢిల్లీలో గణతంత్ర వేడుకల్లో జరిగిన పేరేడ్‌లో ఏటకొప్పాక ఆంధ్రప్రదేశ్ శకటంలో నృత్య ప్రదర్శనలో పాల్గొని పాఠశాలకు వచ్చిన విద్యార్థి మదిరి తనుష్ తేజను పాఠశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం లంకా రాణి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సిబ్బంది తనుష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఆదాయ లక్ష్యం రూ.7,374 కోట్లు

యానాం: ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం చివరి దశకు చేరుకుంటున్న దశలో పుదుచ్చేరి ప్రభుత్వం రెవెన్యూ లక్ష్యాన్ని బుధవారం రూ.7,374కోట్లకు సవరించింది. అంచనా వేసిన విధంగా 71శాతం లక్ష్యాన్ని సాధించగలగడంతో మిగిలిన లక్ష్యాన్ని సైతం సాధించగలమనే ధీమాను అధికారులు వ్యక్తం చేశారు. జనవరి 20 నాటికి సొంత వనరుల నుంచి రూ.5,249 కోట్లు వచ్చినట్లు తెలిపారు. గత నెలలో పెట్రోలు, డీజిల్ వంటి పెట్రోలియం ఉత్పత్తులపై వ్యాట్ ట్యాక్స్ పెంపు, ఇతర ఆదాయ మార్గాల ద్వారా అంచనా వేస్తూ 2024–25 బడ్జెట్ అంచనాలలో సొంత వనరుల నుంచి ఆదాయ లక్ష్యాన్ని దాదాపు రూ.460 కోట్లకు సవరించింది. గత ఏడాది ఆగస్టులో సమర్పించిన మధ్యంతర బడ్జెట్‌లో వాణిజ్య పన్ను, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్, రవాణా, విద్యుత్ సుంకాల వసూలు, వినియోగదారుల చార్జీలు వంటి పన్నేతర రంగాల నుంచి రూ.6,914 కోట్ల ఆదాయ వసూళ్ల అంచనా వేశారు.

శివారుకు సాగునీటి కొరత

- భారీగా తగ్గిపోయిన నీటి ప్రవాహం
- డివైడింగ్ డ్యాం వద్ద నాలుగు అడుగుల దిగువకు నీటిమట్టం
- గ్రామాల్లో ఎండి పోతున్న వరిచేలు
- ఆందోళనలో రైతన్నలు
- ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణ



ప్రధాన సీఐపీ కాలువ వద్ద తగ్గిన నీటి మట్టం



పి.మల్లవరంలో ఇంజిన్లతో నీరు తోడుకుంటున్న రైతులు

తాళ్లరేవు: శివారు భూములకు సాగునీరు అందకపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఎన్నో ఆశలతో రబీ పంటకు ఉపక్రమించిన రైతన్నకు ఆదిలోనే సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. ప్రధాన పంట కాలువల్లో సైతం నీటి ప్రవాహం తగ్గిపోవడంతో వరిచేలకు నీరందక రైతులు అష్ట కష్టాలు పడుతున్నారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలకు నీటిని సరఫరా చేసే ప్రధాన సీఐపీ పంట కాలువ (కోరంగి ఐలాండ్ ప్రాజెక్టు)లో సైతం నీటి సరఫరా తక్కువగా ఉంది. దీంతో పోలేకుర్రు, పి.మల్లవరం, జార్జీపేట, నీలపల్లి తదితర ప్రాంతాలకు వెళ్లే టీఎస్ఎస్ కాలువల్లో నీటి సరఫరా తగ్గిపోయి ఆయా ఆయకట్టలోని పంట చేలకు పూర్తిస్థాయిలో నీరు అందడం లేదు. ముఖ్యంగా పి.మల్లవరం, నీలపల్లి, జార్జీపేట గ్రామాలలోని పంట చేలకు పూర్తి స్థాయిలో సాగునీరందక వరిచేలు ఎండిపోయి బీటలు వారుతున్నాయి. దీంతో సాగునీటి కోసం రైతన్నలు ఆందోళనబాట పడుతున్నారు. సాగునీటి కోసం డీజిల్ ఇంజిన్లు ఏర్పాటు చేసుకుందామన్నా కాలువల్లో నీరు అందని పరిస్థితి నెలకొందని పలువురు రైతులు వాపోతున్నారు. ఇంజిన్ల ద్వారా ఏటా ఆర్థిక భారం ఎక్కువవుతోందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నీరు అందక ఎండిపోతున్న వరిచేను

తగ్గుదలతో ఆందోళన

పోలేకుర్రు ఇరిగేషన్ కార్యాలయం వద్ద గల డివైడింగ్ డ్యామ్ వద్ద నీటి మట్టం నాలుగు అడుగుల దిగువకు చేరుకోవడంతో మండలంలోని వరి ఆయకట్టుకు పూర్తి స్థాయిలో సాగునీరు అందడం లేదు. ఈ నెల 1వ తేదీన 4.8, 4.9 అడుగులు ఉన్న నీటిమట్టం గత నాలుగు రోజులుగా తగ్గుతూ వచ్చింది. బుధవారం నాటికి 3.8 అడుగులకు చేరింది. సంక్రాంతి పండగ నుంచి నీటి సరఫరా తగ్గిపోయిందని, ఆందోళన నేపథ్యంలో రెండు, మూడు రోజులు ఇచ్చి మరలా తగ్గించి వేసారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న, సన్నకారు రైతులు గుల్లలు, డీజిల్ ఇంజిన్లను ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. సాగు ప్రారంభం నుంచి నీటి కష్టాలు మొదలవడం పట్ల రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంతుల వారీ విధానాన్ని అమలు చేసి పూర్తి స్థాయిలో సాగునీటిని అందించాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

సరఫరా తగ్గడం వాస్తవమే

వారం రోజులుగా నీటి సరఫరా తగ్గినమాట వాస్తవమే. ప్రధాన పంట కాలువకు సంబంధించి ఈ నెల 1వ తేదీ నుంచి వంతుల వారీ విధానం అమలవుతుంది. తాళ్లరేవు మండలానికి సంబంధించి ఈ నెల 7వ తేదీ నుంచి వంతు అమలు కానుంది. శుక్రవారం నుంచి నీటి మట్టం పెరుగుతుంది. నామవానిపాలెం, సీఐపీ మెయిన్, తాళ్లరేవు నార్త్ ఛానళ్లలో కర్రనాచు, తూడు తొలగించాం.

– **అనూష**, ఇరిగేషన్ ఏఈ, తాళ్లరేవు.

వరిచేలు బీటలు వారుతున్నాయి



ఐదెకరాల్లో కౌలు వ్యవసాయం చేస్తున్నాను. సాగునీరు అందక వరిచేలు బీటలు వారుతున్నాయి. కాలువలో నీరు లేకపోవడంతో తోడుకోవడానికి కుదరడంలేదు. ఇప్పటి వరకు రెండు సార్లు ఎరువులు వేశాను. అయితే సాగునీరు పూర్తి స్థాయిలో అందకపోవడంతో ఉపయోగం లేకుండా పోయింది. ఇప్పటికే రూ.30 వేలు ఖర్చయింది. నీరు ఇవాళ వస్తుంది, రేపు వస్తుందని అధికారులు చెప్పడం తప్ప వచ్చిన దాఖలాలు లేవు.

– **గుత్తుల సూర్యనారాయణ**, రైతు, జార్జీపేట.

ప్రజా ప్రయోజనాలకు తిలోదకాలు!

- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న పీఆర్ అధికారులు
- కూటమి నాయకులకు లబ్ధి చేకూరేలా పనులు
- అవసరం లేని చోట సీసీ రోడ్డు నిర్మాణంపై ప్రజాగ్రహం
- రూ.12 లక్షల నిధుల దుర్వినియోగం



దేవగుప్తంలో అవసరం లేకున్నా నిర్మిస్తున్న రోడ్డు

అల్లవరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లె పండగ కార్యక్రమం ద్వారా చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణం అబాసుపాలైంది. ఏ మాత్రం ప్రజా ప్రయోజనం లేని ప్రాంతాల్లో అధికార పార్టీకి చెందిన నాయకులకు లబ్ధి చేకూరే విధంగా పీఆర్ అధికారులు శ్రమిస్తున్నారు. ఏ అభివృద్ధి పని చేసినా ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలి. అయితే పీఆర్ అధికారులు ఇవేమీ పట్టించుకోవడం లేదు. టీడీపీ నాయకులు చెప్పిందే వేదంగా వారు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. దేవగుప్తం పంచాయతీ పరిధిలో పల్లె పండగ నిధులు రూ.12 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణాన్ని డిసెంబర్ 8న చేపట్టారు. ఈ రోడ్డు నిర్మాణం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ఉంది. కనీసం ఒక నివాసం కూడా లేని ప్రాంతంలో నిర్మాణం చేపట్టడంతో సాక్షిలో 'నిరుపయోగ నిర్మాణమేల' శీర్షికతో కథనం వెలువడింది. ఈ కథనంపై స్పందించిన పీఆర్ అధికారులు సీసీ నిర్మాణాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. అయితే పీఆర్ డీఈ రాజ్‌కుమార్ స్థానిక నాయకులతో మంతనాలు జరిపి రెండు రోజుల క్రితం సీసీ రోడ్డు పనులు చేపట్టారు. అయితే టీడీపీలో ఓ వర్గం హైస్కూల్ వెనక వైపు సీసీ రోడ్డు నిర్మాణానికి ఆది నుంచి వ్యతిరేకిస్తోంది. ఎస్సీ ప్రాంతాలు, ఇందిరమ్మ కాలనీలో రోడ్డు అవసరం ఉన్న చోట వదిలేసి అవసరం లేని చోట నిర్మాణం ఎందుకు చేయాల్సి వస్తుందని టీడీపీలోని మరోవర్గం ప్రశ్నిస్తుంది. ఇవేమీ తమకు పట్టనట్లుగా పీఆర్ డీఈ ప్రజా ప్రయోజనాలను విస్మరించి నిరుపయోగ నిర్మాణ పనులు చేపట్టారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



బాధితులకు సాయం అందిస్తున్న పీఈటీ నరసింహారావు

అమలాపురం రూరల్: రూరల్ మండలం ఈదరపల్లి బొంతువారిపేటలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి కట్టు బట్టలతో రోడ్డున పడ్డ బాధితులకు తమ వంతు సాయం అందించేందుకు పలువురు దాతలు ముందుకు వచ్చారు. ఇందుపల్లి హైస్కూల్ పీఈటీ నరసింహారావు (బుజ్జి) అగ్ని బాధితులకు దుప్పట్లు, టవళ్లు, దుస్తులు అందించారు. పాఠశాల హెచ్‌ఎం వి శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు జి.పెద్దిరాజు, ఉపాధ్యాయులు కలిసి అగ్ని బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఒంటెద్దు బాబి అగ్ని బాధితులను పరామర్శించారు. పట్టణ అధ్యక్షుడు బాబీ, జిల్లా కాంగ్రెస్ పార్టీ ట్రెజరర్ సుగ్గు ప్రసాద్ అగ్ని బాధితులకు వంట సామాగ్రి, నిత్యావసరాలు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎం. వెంకటేశ్వరరావు, ఏలేశ్వరపు రాధాకృష్ణ, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు. అమలాపురం మహిళా వాకర్స్ హెల్త్‌క్లబ్ సభ్యులు నిత్యావసర వస్తువులు, సామగ్రి అందించారు. క్లబ్ అధ్యక్షురాలు యర్రమిల్లి అనంతక్ష్మి, కార్యదర్శి గోటేటి లక్ష్మి, కోశాధికారి కంకటాల విజయలక్ష్మి, డాక్టర్ నాగమానస, జిల్లా బులిటిన్ ఎడిటర్ పుత్సాకృష్ణ కామేశ్వర్, పీఆర్వో యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆలయ పున: ప్రతిష్ఠా మహోత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

ముమ్మిడివరం: క్రాపచింతలపూడిలో ఉమా వల్లభేశ్వరస్వామి ఆలయ పునఃప్రతిష్ఠా మహోత్సవాలు బుధవారం రెండో రోజు ఘనంగా జరిగాయి. వేద పండితులు ఎలమంచిలి కృష్ణమూర్తి శివాచార్యుల పర్యవేక్షణలో బాదంపూడి సత్యనారాయణ శర్మ, ఉండి సుబ్రహ్మణ్య శర్మ మంత్రోచ్ఛారణల మధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, పలువురు నాయకులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

బడ్జెట్‌తో తీరని అన్యాయం



బడ్జెట్‌కు వ్యతిరేకంగా అమలాపురంలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అమలాపురం టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో ఏపీకు తీరని అన్యాయం జరిగిందని సీపీఎం జిల్లా శాఖ నాయకులు గళమెత్తారు. స్థానిక గడియారం స్తంభం సెంటరులోని గాంధీ విగ్రహం వద్ద బుధవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. నిరసనలో పాల్గొన్న రాష్ట్ర సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు బలరామ్ మాట్లాడుతూ కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి చూపించిందన్నారు. గతంలో ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలుకు నిధులు కేటాయించలేదని పేర్కొన్నారు. అందుకే కేంద్ర బడ్జెట్‌పై సర్వత్రా ప్రజా వ్యతిరేకత వ్యక్తం అవుతోందన్నారు. ప్రత్యేక హోదా, వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ, జాతీయ విద్యా సంస్థ, రైల్వే జోన్.. ఇలాంటి హామీలెన్నింటికో బడ్జెట్‌లో ప్రస్తావన లేదని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా సీపీఐ కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో జిల్లా పార్టీ నాయకులు కృష్ణవేణి, దుర్గాప్రసాద్, ఎన్.బలరామ్, టి.నాగ వరలక్ష్మి, పీతల రామచంద్రరావు, కె.సాయి తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ నిరసన

తాళ్లరేవు: ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు వ్యతిరేకంగానూ, పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉందంటూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేసారు. స్థానిక ప్రజా సంఘాల భవనం నుంచి చెరువుగట్టు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద ప్రజా సంఘాల మండల కన్వీనర్ టి. ఈశ్వరరావు మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సంక్షేమ రంగాలకు నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కెఎస్ శ్రీనివాస్, వల్లు రాజబాబు, నాగలక్ష్మి, అనంతలక్ష్మి, కళావతి, ఈశ్వరీబాయి, అంగన్వాడీలు, ఆశా వర్కర్లు, యానిమేటర్లు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

యానాంలో పుదుచ్చేరి డీఐజీ బస

యానాం: పుదుచ్చేరి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (లా అండ్ ఆర్డర్)డీఐజీ ఆర్ సత్య సుందరం మూడు రోజుల అధికార పర్యటన కోసం సోమవారం రాత్రి యానాం వచ్చారు. ఈ సందర్భంగా తొలిసారిగా యానాం వచ్చిన ఆయనకు స్థానిక ప్రభుత్వ అతిథి గృహం వద్ద ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం, ఎస్సైలు ఇలంగో, నూకరాజు తదితరులు స్వాగతం పలికారు. ఈ నెల 6, 7, 8 తేదీల్లో యానాంలో పోలీస్ స్టేషన్‌ల పరిశీలన, పోలీస్ వెల్ఫేర్ సమావేశం, ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

అంకెలు ఘనం.. వసూళ్లు మందగమనం!

- సవరణ, అంచనా బడ్జెట్ ఆమోదం
- మందకొడి వసూళ్లపై వాడీవేడి చర్చ
- ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్సీ, కౌన్సిలర్లు
- మాటల్లో కాదు చేతల్లో చూపాలని డిమాండ్



పన్నుల వసూళ్లపై అధికారుల నిర్లక్ష్యాన్ని నిలదీస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, కౌన్సిలర్లు

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీకి సంబంధించి 2024–25 ఏడాదికి సవరించిన బడ్జెట్‌తో పాటు 2025–26 ఏడాదికి రూపొందించిన అంచనా బడ్జెట్‌ను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో బుధవారం జరిగిన బడ్జెట్ సమావేశం బడ్జెట్ స్వరూపానికి ఆమోద ముద్ర వేస్తూనే పొందు పరిచిన అంకెలపై లోతైన సమీక్ష, చర్చకు కౌన్సిల్ సమావేశం తెర తీసింది. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, పాలక పక్ష కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, సంసాని బులినాని, గొవ్వాల రాజేష్, చిట్టూరి పెదబాబు, దొమ్మేటి రాము తదితరులు బడ్జెట్‌పై చర్చించారు. కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, అకౌంటెంటెంట్ కె.రామకృష్ణ, రెవెన్యూ అధికారిణి భూపతి శ్రీలక్ష్మి, డీఈఈ సీహెచ్.నాగ సతీష్ తదితరులు ఈ చర్చలో కౌన్సిలర్లు అడిగిన పలు ప్రశ్నలకు బదులిచ్చారు.

బడ్జెట్ స్వరూపం ఇదీ..

2024–25 ఏడాదికి ప్రారంభ నిల్వ రూ.14,97,42,468 చూపించి ఆదాయం రూ.46,95,58,500, ఖర్చులు రూ.53,09,35,500, ముగింపు నిల్వ రూ.8,83,65,468తో సవరించిన బడ్జెట్‌ను, 2025–26 సంవత్సరానికి ప్రారంభ నిల్వను రూ.8,83,65,468 చూపించి ఆదాయంగా రూ.54,06,06,00, ఖర్చులుగా రూ.59,20,92,00, ముగింపు నిల్వగా రూ.3,68,79,468తో అంచనా బడ్జెట్‌ను కౌన్సిల్ ఆమోదించింది.

వసూళ్లపై అంత నిర్లక్ష్యమా..

బడ్జెట్‌లో అంకెలను మాత్రం బాగా చూపించారు. అయితే వాస్తవ పరిస్థితుల్లో అంత మేర ఆదాయం సమకూరేలా పన్నుల వసూళ్లు మాత్రం ఉండడం లేదని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావుతో సహ పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు అధికారులపై ధ్వజమెత్తారు. ట్రేడింగ్ లైసెన్స్ రెన్యూవల్, కొత్తగా లైసెన్స్‌లు ఇవ్వడంపై అధికారుల నిర్లక్ష్యంపై ఎమ్మెల్సీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.14 లక్షల బకాయిలను వసూలు చేయడంలో అశ్రద్ధ ఎందుకని ప్రశ్నించారు. తాగునీటి కుళాయి పన్నులు ముఖ్యంగా మీటరున్న కుళాయిలను అధికారులు చూసీ చూడనట్లు వదిలేస్తూ మున్సిపల్ ఆదాయాన్ని ఆవిరి చేస్తున్నారని కౌన్సిలర్ నాగేంద్ర ఆందోళన వ్యక్తం చేశారు. తాగునీటి పన్నుల వసూళ్లలో రూ.1.62 కోట్ల మేర బకాయిలు ఉండి కేవలం 22 శాతం పన్నులు వసూలు చేశారని ఏఈ భాస్కరావుపై ధ్వజమెత్తారు. షాపింగ్ కాంప్లెక్స్‌ల ద్వారా వచ్చే ఆదాయాన్ని కూడా వసూలు చేయలేకపోతున్నారని ఆరోపించారు. ముఖ్యంగా షాపులకు సాల్వెన్సీ సర్టిఫికెట్లు, డిపాజిట్లు కట్టించుకోలేని దుస్థితిలో ఉన్నారని ధ్వజమెత్తారు. అలాంటి లీజుదారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. లీజుదారులకు స్టాండింగ్ కౌన్సిల్ ద్వారా నోటీసులు ఇస్తున్నామని, అద్దెల బకాయిలు ఉన్న షాపులను సీజ్ చేద్దామని వెళుతుంటే రాజకీయపరమైన ఫోన్లు, వొత్తిళ్లు వస్తున్నాయని రెవెన్యూ అధికారి శ్రీలక్ష్మి సభాముఖంగా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష కౌన్సిలర్లు తిక్కిరెడ్డి సత్యలక్ష్మి, అబ్బిరెడ్డి చంటి, యేడిద శ్రీను బడ్జెట్‌పై మాట్లాడుతూ ఇదో అంకెల గారిడీ బడ్జెట్ అని వ్యాఖ్యానించారు.

విభాగాలకు కేటాయింపులు ఇలా..

విభాగం	కేటాయింపు మొత్తం
తాగునీటి సరఫరా	రూ. 1.80 కోట్లు
డ్రెయిన్ల నిర్వహణ	రూ. 1.25 కోట్లు
రోడ్లు	రూ. 2 కోట్లు
వీధి దీపాలు	రూ. 70 లక్షలు
పార్కులు	రూ. 85 లక్షలు
మార్కెట్లు, టాయిలెట్‌లు	రూ.1.90 కోట్లు
మురికి వాడల అభివృద్ధి	రూ. 2.08 కోట్లు
పారిశుధ్యం	రూ. 1 కోటి
శ్మశాన వాటికలు	రూ. 25 లక్షలు

సెపక్ తక్రా క్రీడాకారులకు అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న జిల్లా అధ్యక్షుడు జవ్వాది తాతబాబు

అమలాపురం రూరల్: వివిధ విభాగాలలో 2024 మార్చి నుంచి 2025 ఫిబ్రవరి వరకు జాతీయ స్థాయి సెపక్ తక్రా క్రీడల్లో పాల్గొని ఉత్తమ ప్రదర్శన కనబరిచిన క్రీడాకారులకు జిల్లా సెపక్ తక్రా క్రీడా అధ్యక్షుడు జవ్వాది తాతబాబు అభినందించారు. అమలాపురం ఎస్‌కేబీఆర్ కాలేజీలో బుధవారం అభినందన కార్యక్రమం జరిగింది. జనవరి 9 నుంచి 14 వరకు వరంగల్‌లో జరిగిన జాతీయ స్థాయి సీనియర్ క్రీడా విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కేతా సతీష్, మోహన్‌కృష్ణలను అభినందించారు. కేరళ రాష్ట్రం పాలకడ్‌లో జరిగిన జాతీయ స్థాయి సబ్ జూనియర్ సెపక్ తక్రా పోటీల్లో ప్రతిభ కనబరిచిన శశిధర్ నాగ్, పూర్ణ లక్ష్మీ ప్రసన్న లను అభినందించారు. విజయవాడలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన జాతీయ స్థాయి సబ్ జూనియర్ సెపక్ తక్రా చాంపియన్‌షిప్‌లో జాతీయ స్థాయిలో అత్యున్నత ప్రదర్శన చేసినా గోసంగి సందీప్‌లను అభినందించారు. అసోసియేషన్ సభ్యులు ఇందుకూరి శ్రీధర్ వర్మ, డాక్టర్ నరసింహారావు, మునగాల మన్యం, తోట రాము, కేవీవీ సత్యనారాయణ, కోచ్ యండ్రా గౌతమ్, పీడీ బూల చిరంజీవి, వాకర్స్ సభ్యులు క్రీడాకారులను అభినందించారు.

కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి



అమలాపురంలో ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ, కార్మిక సంఘాల నాయకులు

అమలాపురం టౌన్: లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ఏ రంగంలో పనిచేసే కార్మికులకైనా కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ అమలాపురం గడియారం స్తంభం సెంటరులో సీఐటీయూ జిల్లా శాఖ బుధవారం సాయంత్రం ధర్నా నిర్వహించింది. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం చెల్లించాలని, రైతుల పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని జిల్లా శాఖ అధ్యక్షుడు జి.దుర్గా ప్రసాద్, ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్ డిమాండ్ చేశారు. కార్మికులకు ఎలాంటి ఆంక్షలు లేని హక్కులను ప్రభుత్వాలు అమలు చేయాలని వారు పేర్కొన్నారు. జిల్లా సీఐటీయూ కోశాధికారి కె.కృష్ణవేణి, ఉపాధ్యక్షుడు భాస్కరరావు, వివిధ కార్మిక సంఘాల జిల్లా నాయకులు బి.వెంకటలక్ష్మి, జితేంద్ర, అమూల్య, ఆదిలక్ష్మి, ఎం.సుభాషిణి, కుసుమ తదితరులు ధర్నాలో పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాల అందజేత



నిత్యావసరాలు అందజేస్తున్న నరవరాజు

తాళ్లరేవు: యూనివర్సల్ వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో 20 మంది దివ్యాంగులకు బియ్యం, నిత్యావసర వస్తువులు, కూరగాయలు పంపిణీ చేసారు. స్థానిక దివ్యాంగుల కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో దాతలు ప్రవీణ్ రెడ్డి, మేరీ ఆర్థిక సహాయంతో సమకూర్చిన కిట్‌లను ట్రస్టు అధ్యక్షుడు నరవరాజు అందజేశారు. కార్యక్రమంలో మహేశ్వరి, ప్రశాంత్, గణేష్, ఉషోదయా మండల దివ్యాంగుల సమాఖ్య అధ్యక్షుడు కె.శ్రీనివాస్, జి.సీతా మహాలక్ష్మి, దివ్యాంగులు పాల్గొన్నారు.

అర్చకుడు పెద్దింటికి మల్లాడి పరామర్శ

యానాం: స్థానిక భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయ అర్చకులు పెద్దింటి అనంతాచార్యులు, రాఘవాచార్యులు, సాయిరాం కృష్ణ మాతృమూర్తి నిర్మల కుమారి మృతి చెందడంతో బుధవారం వారి కుటుంబ సభ్యులను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పరామర్శించారు. కార్యక్రమంలో కాపగంటి ఉమాశంకర్, అర్చకులు రఘురామ వినోద్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలి



సేవా శిబిరంలో మాట్లాడుతున్న ఆర్‌ఏఓ మునిస్వామి

యానాం: విద్యార్థి స్థాయి నుంచే సేవా భావన్ని అలవర్చుకోవాలని ఆ విధంగా దేశానికి తమ వంతు సేవ చేయాలని ఆర్ఏఓ మునిస్వామి పేర్కొన్నారు. బుధవారం సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్–1, యూనిట్–2 ల ప్రత్యేక సేవా శిబిరం ప్రారంభం సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కర రెడ్డి మాట్లాడుతూ మానవ వనరులు, సాంకేతిక వనరులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా సమాజంలో అనేక సమస్యలను పరిష్కరించ వచ్చునన్నారు. అనంతరం మొదటి రోజు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ చెల్లి నరేష్, సిద్దిరెడ్డి శ్రీనివాస్, కోఆర్డినేటర్ సీహెచ్‌కే సుధాకర్, అధ్యాపకులు డాక్టర్ తాతపూడి ముత్యాలు, జెవి సుధాకర్, సూపరింటెండెంట్ విజయసాగర్ తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధిని అడ్డుకుంటున్నారు'



ఎల్జీ కైలాష్‌నాథన్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: ఎమ్మెల్యేగా ఎన్నికై న నాటి నుంచి మూడున్నర ఏళ్లుగా యానాం ప్రాంతానికి సంబంధించి వివిధ అభివృద్ధి పనుల కోసం ప్రతిపాదనలు సమర్పించడం, వాటి అమలు కోసం ప్రభుత్వానికి గుర్తు చేయవలసిన దుస్థితి నెలకొనడంతో ఆవేదన వ్యక్తం చేస్తూ ఎల్జీ కె కై లాష్ నాథన్‌కు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఫిర్యాదు చేశారు. బుధవారం పుదుచ్చేరిలో రాజ్‌నివాస్‌లో ఎల్జీ కై లాష్ నాథన్‌తో ఆయన సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ 108 పనులకు సంబంధించి నివేదికలు సమర్పించినా ఇంతవరకు వాటిపై కార్యచరణ లేదన్నారు. కావాలనే కొందరు ప్రజాభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వివిధ శాఖలలో నెలకొన్న అపరిష్కృత సమస్యలను, అధికారులు వ్యవహరిస్తున్న తీరును కై లాష్ నాథన్‌కు వివరించే ప్రయత్నం చేశారు.